ఇసుక రీచులకు టెండర్లు

పార్వతీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇసుక రీచులకు (భామిని మండలం నేరడి, పసుకుడి, పాలకొండ మండలం చిన మంగళాపురం) టెండర్ల ప్రక్రియ మొదలైంది. జేసీ శోభిక సమక్షంలో శనివారం కలెక్టరేట్‌లో టెండర్ డబ్బాలకు సీల్ వేయించారు. జనవరి-3తో టెండర్ల ప్రక్రియకు గడువు ముగుస్తుందని ఆమె తెలిపారు. ఈ లోపుగా రూ.10 వేలు డీడీ తీసి కలెక్టరేట్ ప్రత్యేక సెల్‌లో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు. జేసీ వెంట గనులు, భూగర్భ శాఖ అధికారి జి.శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆ భూమి కోసం.. నకిలీ ఐపీఎస్‌గా..

- ఎంపికైనట్లు నమ్మించి హైదరాబాద్‌కు..
- తిరిగి వచ్చి పోలీసు యూనిఫాంతో హల్‌చల్
- అదే దుస్తులతో బంధువులు, స్నేహితుల ఇళ్లకు..
- ఇటీవల డిప్యూటీ సీఎం కార్యక్రమానికి హాజరు
- ప్రముఖులతో ఫొటోలు దిగి వాట్సాప్ స్టేటస్‌లు
- పోలీసు అధికారుల విచారణతో గుట్టురట్టు
- నిందితుడి అరెస్టు

సాలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ నుంచి పారిపోయి వచ్చాడు. బీటెక్ పూర్తిచేసి వ్యాపారం చేశాడు. అదీ నచ్చక హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. కరోనా సమయంలో తండ్రి చనిపోవడంతో తిరిగి వచ్చాడు. అప్పుడే తండ్రి పురోణి రాయించుకున్న భూముల వ్యవహారం తెలిసింది. వాటిని సొంతం చేసుకోవడానికి నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తాడు. యూనిఫారంలో ఉన్న ఫొటోలను చూపెడితే పని అయిపోతుందనుకున్నాడు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ పర్యటనలో హల్‌చల్ చేశాడు. ప్రముఖులతో ఫొటోలు దిగి వాటిని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. అనుమానం వచ్చి పోలీసు అధికారులు ఆరా తీశారు. అంతే.. నకిలీ ఐపీఎస్ గుట్టు రట్టు అయింది. విజయనగరం మండలం అంబటివలస గ్రామానికి చెందిన బలివాడ సూర్యప్రకాష్ నడిపిన యాక్షన్ కథ ఇది. సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత సురానా శనివారం విలేకరులకు వివరాలను వెల్లడించారు.

విజయనగరం మండలం అంబటివలసలో ఉంటున్న బలివాడ సూర్యప్రకాష్ స్వగ్రామం దత్తిరాజేరు మండలం గడసాం. 2003 నుంచి 2005 వరకు ఇండియన్ ఆర్మీలో సిపాయిగా పని చేసి ఉద్యోగాన్ని విడిచిపెట్టి వచ్చేశాడు. 2016 వరకు తన తండ్రి తవిటిబాబుతో కలిసి కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ ఉండేవాడు. ఆ తర్వాత తూనికలు, కొలతలకు సంబంధించిన షాపును విజయనగరంలో నడిపాడు. ఆ సమయంలో కూడా నకిలీ ఇన్‌స్పెక్టర్‌గా అందరినీ నమ్మించే వాడు. షాపును తన బంధువులకు అప్పగించి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడు. 2020లో కరోనాతో తండ్రి మృతిచెందాడు. అయితే 2005లో తన తండ్రి ఎకరా రూ.30వేలు చొప్పున తొమ్మిది ఎకరాల 79 సెంట్లకు పురోణి రాసినట్లు తాజాగా తెలుసుకున్నాడు. ఆ భూమికి సంబంధించి తండ్రి కొంత మేర అడ్వాన్స్ చెల్లించినట్లు నిర్ధారించే ధ్రువపత్రాలను గుర్తించాడు. ఆ భూమి దక్కించుకోవడం కోసం నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తాడు. ఐపీఎస్ సెలెక్ట్ అయ్యాయని చెప్పి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉన్నప్పుడే యూనిఫారం కుట్టించుకున్నాడు. నకిలీ ఐడీ కార్డులు తయారు చేసుకున్నాడు. తిరిగి వచ్చి పోలీసు యూనిఫాంతో హల్‌చల్ చేశాడు. అవే దుస్తులతో

(మిగతా 8వ పేజీలో...)



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిందితుడి కారు



సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న జిల్లా పోలీస్ అధికారులు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

ఒక్కొక్కటిగా వెలుగులోకి...

పార్వతీపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయనగరంలో జరిగిన 5వ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్‌కు సూర్యప్రకాష్ కుటుంబంతో వెళ్లి మొదటి వరుసలో కూర్చొన్నాడు. అదేవిధంగా ఆగస్టు15న విజయనగరంలోని తాను చదువుకున్న పాఠశాలలకు ముఖ్య అతిథిగా వెళ్లాడు. కొద్ది రోజుల కిందట ఆయన్ని ఐపీఎస్ అధికారిగా భావించి పదోన్నతి పొందిన ఓ పోలీస్ అధికారి ఫొటో తీసుకున్నారు. సాలూరులో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌ను ఐపీఎస్‌గా ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. నకిలీ ఐపీఎస్‌పై సందేహం వచ్చి మరో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఆరా తీయగా ఆయన్ని బెదిరించినట్లు ప్రచారం జరుగుతుంది.

విశాఖలో అదుపులోకి..

విజయనగరంక్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో ఫొటోలు దిగిన నకిలీ ఐపీఎస్ అధికారి బలివాడ సూర్యప్రకాష్‌ను శనివారం తెల్లవారు జామున విజయనగరం రూరల్, ఎస్‌బీ సీఐలు లక్ష్మణరావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి కలిసి విశాఖలో అదుపులోకి తీసుకున్నారు. పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో సూర్యప్రకాష్‌పై కేసు నమోదైన నేపథ్యంలో ఆ స్టేషన్‌కు అప్పగించారు.

అటవీ ఉత్పత్తులపై దృష్టిసారించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో లభ్యమయ్యే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు, వాటి దిగుబడి, మార్కెటింగ్‌పై దృష్టిసారించాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో డీఎంజీసీసీ ట్రేడర్స్, మండల ఉద్యాన శాఖాధికారుతో సమీక్షించారు. అటవీ ఉత్పత్తుల విక్రయాలు, మద్దతు ధర తదితర అంశాలపై చర్చించారు. ఎంత మేర మద్దతు ధర ప్రకటిస్తే గిరిజనులు లబ్ధి పొందుతారన్న దానిపై పలు సూచనలిచ్చారు.

పకడ్బందీగా పోలీసుల నియామక ప్రక్రియ

- నిబంధనలు పాటించాలి
- విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో చేపడుతున్న పోలీసు ఉద్యోగ నియామక ప్రక్రియ పకడ్బందీగా సాగాలని, విధుల్లో ఎవరూ అలసత్వం వహించవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సివిల్ పోలీసు కానిస్టేబుల్స్, ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియ ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ చాలా సున్నితమైనదని, ప్రతి ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. అలసత్వంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియామకాలు పూర్తిగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారంగా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియామకాల ప్రక్రియ రోజూ ఉదయం 4 గంటలకు ప్రారంభమౌతుందని, అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు పుట్టిన తేదీ, విద్యార్హతలు, రిజర్వేషన్ ధ్రువపరిచే అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఏదైనా కారణంతో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తీసుకురా వడంలో విఫలమైతే, వారికి రిక్రూట్‌మెంట్ జరిగే మరో రోజున అవకాశం ఇస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్‌కు గుర్తింపు కార్డు ఇస్తామని, వారు మాత్రమే పరేడ్ గ్రౌండ్‌లో ఉండాలన్నారు. వైద్య, పారా మెడికల్ సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సరికొత్తగా ఉపాధి

- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు
- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

6లో



సుంకి గ్రామ సమీప తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

గజగజలాడిస్తున్నాయ్..

- సుంకిని వదలని ఏనుగులు
- భయాందోళనలో గ్రామస్థులు, రైతులు

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. కొద్దిరోజులుగా సుంకిలోనే సంచరిస్తున్న ఏనుగులు వరి కుప్పలు , ధాన్యం నిల్వలతో పాటు అరటి, తదితర వాటిని నాశనం చేశాయి. శనివారం గ్రామంలోని టీ దుకాణం, రైతుల వ్యవసాయ సామగ్రితోపాటు పైపులను ధ్వంసం చేశాయి. పగలు పంట పొలాల్లో, రాత్రిళ్లు తోటల్లో ఉంటూ గ్రామస్థులు, రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆ ప్రాంతవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గజరాజుల గుంపును తరలించడంలో అటవీ శాఖాధికారులు విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సందడిగా..

- తాడికొండలో కందికొత్తల పండగ
- థింసా నృత్యం చేసిన విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడికొండ గ్రామంలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా కందికొత్తల పండగను జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు సాగు చేసిన కందులు, జొన్నలు, రాగులు, కొర్రలు, వరి పంటలను శనివారం గిరిజన దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వాటిని ప్రసాదంగా స్వీకరించారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్, కురపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి ఎంతో ఉత్సాహంగా థింసా నృత్యం చేశారు. ఈ పండగకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో వేడుకలు

గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్‌లో ఆదివారం కందికొత్తల పండుగను ఘనంగా నిర్వహించాలని గిరిజన ఐక్యత సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు శనివారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరికి నిర్వాహకులు పండుగ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సంప్రదాయ గిరిజన పండుగకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు రానున్నట్లు వారు తెలిపారు.



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న విప్ జగదీశ్వరి

మన భామిని నెం.1


- నీతిఆయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో అగ్రస్థానం
- దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు



6లో

108 సిబ్బందికి తీపికబురు

- వేతన పెంపునకు సర్కారు గ్రీన్ సిగ్నల్
- అదనంగా రూ.4వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశం



వేంకటేశ్వరునికి పూలంగి సేవ

- ఆకట్టుకున్న అలంకరణ
- ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు



6లో

అలవోకగా తమిళనాడు విజయం

- 191 పరుగుల తేడాతో జమ్ము-కశ్మీర్‌పై గెలుపు
- ఛత్తీస్‌గఢ్‌పై గెలుపొందిన ఉత్తరప్రదేశ్

జేజేఎం పనులు పూర్తి చేయండి: కలెక్టర్



పార్వతీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీలైనంత త్వరగా జిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులు పూర్తిచేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. జేజేఎం కింద ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేశారు. దీనికోసం దగ్గరలో ఉన్న నీటి వనరుల సౌలభ్యాన్ని చూసుకోవాలన్నారు. తోటపల్లి, వెంగళరాయసాగర్ ద్వారా అదనంగా తాగునీటిని సరఫరా చేసేందుకు డీపీఆర్‌ను రూపొందిం చాలని సూచించారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం, జలవనరుల, భూగర్భ శాఖల అధికారులు ఓ.ప్రభాకర రావు, ఆర్.అప్పలనాయుడు, రాజశేఖరరెడ్డి, ఎంపీడీవోలు, సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

30న సాలూరులో పీజీఆర్ఎస్

సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 30న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. జిల్లా అధికారులంతా సాలూరులో జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. గ్రీవెన్స్ అనంతరం శంబర జాతరపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రాణాలర్పించైనా బడిదేవర కొండను కాపాడుకుంటాం

- పరిరక్షణ కమిటీ సభ్యుల వెల్లడి
- గ్రానైట్ తవ్వకాల లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్
- కోరిలో విస్తృత ప్రజా సమావేశం
- పోలీసుల బెదిరింపులను ఖాతరు చేయని గిరిజనులు



గ్రానైట్ తవ్వకాలు నిలిపివేయాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలర్పించైనా బడిదేవర కొండను కాపాడుకుంటామని పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. కొండపై గ్రానైట్ తవ్వకాల లైసెన్స్ రద్దు కోసం శనివారం కోరి గ్రామంలో విస్తృత ప్రజా సమావేశం నిర్వహించారు. అంతకముందు తానవలస నుంచి కోరి వరకు గిరిజనులందరూ సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. అనంతరం బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రజలకు రూరల్ పోలీసులు బెదిరించారు. అనుమతి లేని ఈ సమావేశానికి హాజరైతే కేసులు నమోదు చేస్తామని చెప్పడంతో వారి మధ్య కొంతసేపు వాగ్వాదం చేటుచేసుకుంది. చివరకు ప్రజలు పోలీసుల బెదిరింపులను ఖాతరు చేయకుండా నాయకుల పిలుపుతో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా బడిదేవరకొండపై క్వారీ పనులు చేపడుతున్నారన్నారు. గిరిజనులను ఆదుకొనే బడిదేవరమ్మ గుండెను కోసేస్తుంటే చూస్తూ ఊరుకునేదీ లేదన్నారు. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని తెలిపారు. దీనిపై హైలెవెల్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత గతంలో లైసెన్స్ రద్దు చేశారన్నారు. ఇప్పుడు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు తెలియ జేయకుండానే లైసెన్స్ ఎలా పునరుద్ధరించారని ప్రశ్నించారు. దీనిపై ఆ శాఖ ఎందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం లేదో అర్థం కావడం లేదన్నారు. 20 ఏళ్ల కిందటే రెవెన్యూ, అటవీ శాఖలు కలిసి గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాయని, ప్రస్తుతం సంబంధిత అధికారులు ఏమీ మాట్లాడకపోవడం దారుణమని తెలిపారు. ఈ సమావేశానికి ఎటువంటి సమాచారం లేదని రూరల్ పోలీసులు శుక్రవారం సాయంత్రం నుంచే వాట్సాప్ ద్వారా నాయకులకు హెచ్చరిక నోటీసులు పంపడం, ఫోన్లు ద్వారా బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత, ఏపీ రైతు కూలి, ఆదివాసీ సంఘం, సీపీఐ నాయకులు బొత్స నరసింగరావు, ఎం.కృష్ణమూర్తి, శ్రీనుబాబు, అప్పలనాయుడు, రంజిత్‌కుమార్, సంగం, జీవ, దాసు, రాము, తొక్కుడవలస, తానవలస, సంగంవలస, కోరి, గంగాపురం, రావికోన, ఎంఆర్ నగర్ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● నీతిఅయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో అగ్రస్థానం ● దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు



మన భామిని నెం.1

పార్వతీపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):

పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. నీతిఅయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో జిల్లాలోని భామిని మండలం బ్లాక్ దక్షిణ భారతదేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న వంద బ్లాక్‌లలో భామిని బ్లాక్ ఒకటి. నీతి అయోగ్ ప్రతి త్రైమాసికంలో సూచికలు, సాధనను ప్రామాణికంగా తీసుకొని ర్యాంకులు అందిస్తుంది. దీనిలో భామిని అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకు ప్రోత్సాహకంగా నీతి అయోగ్ నుంచి ఈ మండలానికి రూ.150 కోట్లు మంజూరయ్యాయి. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, జీవనోపాధి, అభివృద్ధి, మౌలిక సదుపాయాల విభాగాల్లో నీతి అయోగ్ సూచికలతో మంచి ఫలితాలను సాధించింది. పదో తరగతి పరీక్షల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించడం.. వంద శాతం భూ ఆరోగ్య కార్డులు పంపిణీ చేయడంతో పాటు 20 పంచాయతీలను టీబీ రహిత గ్రామాలుగా నీతి అయోగ్ గుర్తించింది. మండలంలోని బత్తిలి, బాలేరు, భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులను వంద శాతం గుర్తించి నమోదు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రోత్సాహం.. పంట మార్పిడి.. వంద శాతం సబ్సిడీపై చిరు ధాన్యాలు, విత్తనాల పంపిణీ... తదితర అంశాలలో భామిని మండలం మంచి ప్రగతి సాధించింది. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం 2023లో మార్చి నెలలో ప్రారంభమైంది. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాను దీనిలో ఎంపిక చేశారు. నీతి అయోగ్ సూచికలో 2023లో జిల్లా అగ్రస్థానంలో నిలిచి రూ.3.5 కోట్ల ప్రోత్సాహకానికి అర్హత సాధించింది. ఈ క్రమంలోనే భామిని బ్లాక్ దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలవడం అధికారుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది.


బొడ్డగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)


భామినిలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

అందరి సహకారంతోనే..



దక్షిణ భారతదేశంలో ఉన్న బ్లాక్‌లలో మొదటి స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైంది. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలి. భామిని బ్లాక్ అభివృద్ధిలో ఇదే ర్యాంకును కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాల్సి ఉంది. రక్తహీనత నియంత్రణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించాం.

-శ్యాంప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

అలవోకగా తమిళనాడు విజయం

● 191 పరుగుల తేడాతో జమ్ము-కశ్మీర్‌పై గెలుపు

● ఛత్తీస్‌గఢ్‌పై గెలుపొందిన ఉత్తరప్రదేశ్

విజయనగరం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే వన్డే టోర్నీలో తమిళనాడు జట్టు జమ్ము-కశ్మీర్ జట్టుపై అలవోకగా విజయం సాధించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంతో పాటు, నగర శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో తమిళనాడు, జమ్ము-కశ్మీర్ జట్ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో జమ్ము-కశ్మీర్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 353 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్, వికెట్ కీపర్ ఎన్.జగదీశన్ 147 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సులతో 165 పరుగులు సాధించాడు. అతనికి తోడుగా మిడిలార్డర్ బ్యాటర్ బి.ఇంద్రజిత్ 76 బంతుల్లో 78 పరుగులతో అండగా నిలిచి.. జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం 354 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జమ్ము-కశ్మీర్ జట్టు ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు కోల్పోయి 36.3 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాటర్లు శుభం ఖజూరియా (45 పరుగులు) ఇక్బాల్ (11) అబ్దుల్ సమద్(25), శివాన్స్ శర్మ (10), అబ్దుల్ ముస్తాఖ్ (19), అకిబ్ నబి (38) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. తమిళనాడు బౌలర్ సీవీ అచ్యుత్ అద్భుతంగా బౌలింగ్ చేసి 7.3 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో అచ్యుత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో తమిళనాడు జట్టుకు 4 పాయింట్లు లభించాయి.


క్యాచ్ కోసం తమిళనాడు క్రీడాకారుడి యత్నం

● 32 పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్ విజయం..

విజ్జీ క్రికెట్ మైదానంలో ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ జట్టు టాస్ గెలిచి ఉత్తరప్రదేశ్‌కు బ్యాటింగ్‌ను అప్పగించింది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 272 పరుగులు సాధించింది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ గోస్వామి 81 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 85 పరుగులతో రాణించాడు. మిడిలార్డర్ బ్యాటర్ సమీర్ 48 పరుగులు చేశాడు. ఏడో స్థానంలో వచ్చిన శివం మావి ఆఖరులో ధాటిగా ఆడి అర్ధసెంచరీ (52) చేయడంతో ఉత్తరప్రదేశ్ 272 పరుగులు సాధించింది. జట్టు కెప్టెన్, టీమిండియా ఆటగాడు రింకూ సింగ్ ఒక్క పరుగుకే అవుటై అభిమానులను నిరాశపరిచాడు. ఛత్తీస్‌గఢ్ జట్టు బౌలర్లలో హర్ష యాదవ్ 3, గగన్‌దీప్ సింగ్, శశాంక్ సింగ్ రెండేసి వికెట్లు సాధించారు. అనంతరం 273 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఛత్తీస్‌గఢ్ జట్టు 49.4 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు బ్యాటర్లలో ఏజీ తివారీ (32 పరుగులు), కెప్టెన్ అమన్‌దీప్ ఖారే (44 పరుగులు), శశాంక్ సింగ్ (35), కేడీ ఏక్‌నాథ్ (42) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. ఉత్తరప్రదేశ్ జట్టు బౌలర్లు మోసిన్ ఖాన్ 3, కరణ్‌శర్మ, విప్రాజ్‌నిగం రెండేసి వికెట్లు సాధించారు. 85 పరుగులు సాధించిన అభిషేక్ గోస్వామికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.



సరికొత్తగా ఉపాధి

● ఇకపై కనీస వేతనం రూ.300

● నిరంతరం తనిఖీలు

● పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ


ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

గజపతినగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి కూలీల కనీస వేతనాన్ని రూ.263 నుంచి రూ.300కు పెంచి ఇవ్వడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు పని వేళల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేలా పర్యవేక్షించనుంది. ఈ విభాగానికి దుమాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలు నాలుగు గంటలు పని చేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది ఏపీడీలు, ఏపీఓలు, ఎంపీడీఓలు నిత్యం మస్తర్లు తనిఖీ చేయాలి. కూలీలకు సగటున రూ.300 అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

● బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట..

ఉపాధి పనుల్లో ఇప్పటికే తప్పుడు మస్తర్ల భాగోతం నడుస్తోంది. కూలీలు పనికి రాకపోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్తర్లు వేసి... వేతనాలు స్వాహా చేస్తున్నారు. పని దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనం అందడం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో విజిలెన్స్ అధికారి పర్యవేక్షిస్తారు. గత వైసీపీ పాలనలో అక్రమాలు చోటుచేసుకున్నాయి దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక చోట్ల అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారి నుంచి రికవరీ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

● నిబంధనలు ఇవే..

ఉపాధి కూలీలకు కనీస వేతనం పెంచడానికి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం కూలీలు పని చేయడానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకొని పనులు కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీఓ, ఎంపీడీఓలు మస్తర్లు తనిఖీ చేయాలి. కూలీలు చేసే పని వేళలు, కొలతలు సరిగా లెక్కించాలి. వేతనాల రశీదును కచ్చితంగా ఇవ్వాలి. పనులు చేపట్టే చోట కూలీలకు ప్రథమ చికిత్స కిట్‌ల తో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలి. ప్రభుత్వం అందజేస్తున్న టెంట్లు తప్పనిసరిగా పని చేసే చోట ఏర్పాటు చేయాలి.

● శ్రమశక్తి సంఘాల పునరుద్ధరణ..

గతంలో 20 నుంచి 40 మంది కూలీలతో శ్రమశక్తి సంఘాలు (ఎస్ఎస్ఎస్)గా 20 ఏర్పాటు చేసి... వారికి మేట్‌లను నియమించేవారు. వారికి ఏటా శిక్షణ ఇచ్చేవారు. ఈ సంఘాలు కొన్ని నిర్దిష్టమైన పనులు చేసేవి. మేట్‌లందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయంగా ఉండేవారు. దీంతో పథకం సజావుగా సాగేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రమశక్తి సంఘాలను పట్టించుకోకపోవడంతో కనుమరుగయ్యాయి. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడానికి... కూలీలకు రూ.300 అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మండల స్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి జాబ్ చార్ట్‌పై శిక్షణ, అవగాహన కల్పించనున్నారు.

● లక్ష్యానికి అనుగుణంగా పనివేళలు

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ దినసరి వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కూలీల పనివేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పని చేసే వారు అదనంగా మరో గంట పని చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. జిల్లాలో 3లక్షల 58వేలమంది జాబ్‌కార్డుదారులు ఉన్నారు. వర్షాల కారణంగా సుమారు 27 వేలకు పైగా పనులు చేస్తున్నారు.

-కిరణ్ కుమార్, ఏపీడీ, గజపతినగరం

బాల్య స్మృతులు అ‘పూర్వ’ం

● కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ప్రిన్సిపాల్ శాస్త్రితో పూర్వ విద్యార్థులు

విజయనగరం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుమారు 25 ఏళ్ల క్రితం పది, పదకొండేళ్ల వయస్సులో తల్లిదండ్రులను వదిలి వారంతా క్రమశిక్షణకు మారుపేరైన సైనిక పాఠశాల అనే గూటికి చేరుకున్నారు. ఏడేళ్ల పాటు విద్యనభ్యసించిన ఆ విద్యార్థులు అనంతర కాలంలో వివిధ ప్రాంతాల్లో... విభిన్న హోదాల్లో స్థిరపడ్డారు. మళ్లీ 18 ఏళ్ల అనంతరం తమకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించి... ఉన్నతికి కారణమైన ఆ గూటికి చేరుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల రజతోత్సవాలలో పిల్లలు, కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని సందడి చేశారు. బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. వారే కోరుకొండ సైనిక పాఠశాలకు చెందిన 1999- 2006 బ్యాచ్ విద్యార్థులు. జిల్లా కేంద్రానికి సుమారు 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుకొండ సైనిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలసి శనివారం చేరుకున్నారు. పాఠశాల రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తాము విద్యనభ్యసించిన తరగతి గదులు... వసతి గృహ సముదాయాలు, సెలవు దినాల్లో తోటి స్నేహితులతో తిరిగిన పరిసరాలను... క్రీడా మైదానాలను సందర్శించి... అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలోని డాక్టర్ పీవీజీ రాజు ఆడిటోరియంలో ప్రస్తుత విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, ప్రస్తుతం తాము ఉన్న స్థానాల విశిష్టతను పంచుకున్నారు. సైనిక పాఠశాల గొప్పదనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రికి జ్ఞాపికను అందించారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో ట్యాంకర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పూలంగి సేవ

● ఆకట్టుకున్న అలంకరణ


పూలతో గోదాదేవి


వెంకన్న స్వామికి హారతి


అమ్మవారికి పూలతో అలంకరణ


ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు

బొబ్బిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంచర వీధిలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా శనివారం పూలంగి సేవను నిర్వహించారు. మూల విరాట్‌తో పాటు, ఇతర ఉత్సవ విగ్రహాలను, ఆలయ ప్రాంగణాన్ని పూలతో అలంకరించారు. కడియం ప్రాంతం నుంచి 700 కిలోల పూలను తెప్పించారు. వందల మంది భక్తులు స్వచ్ఛందంగా అలంకరించారు. చామంతులు, జరపరాలు, చిట్టిగులాబీలు, బ్లూడేస్, స్టార్ చామంతులు వంటి వివిధ రకాల పూలతో మొత్తం ఆలయ ప్రాంగణమంతటినీ చూడముచ్చటగా అలంకరించారు. అర్చకులు పొందూరు శ్రీనివాసాచార్యులు, రేజేటి పార్థసారథి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పాశురాలు, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, గోవింద నామార్చన వంటివి చేశారు. బేడా సేవ నిర్వహించారు. నాదనీరాజనం పేరుతో కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలతో పాటు ఆలయాన్ని తిలకించేందుకు... స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులు వేసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

108 సిబ్బందికి తీపి కబురు

సాలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 108 వాహన సిబ్బందికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి వేతన పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నెలకు రూ.4 వేలు అదనంగా ఇవ్వనున్నట్టు సీఎం చంద్రబాబు నాయుడు శనివారం వైద్యశాఖ సమీక్షలో చెప్పారు. దీంతో జిల్లాలోని 108 వాహన సిబ్బంది, జిల్లా మేనేజర్ మన్మథ రావు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా టీడీపీ ప్రభుత్వం 2014లో జీవో 49 ప్రకారం 108 సిబ్బందికి అదనంగా ఇస్తున్న మొత్తాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. దానికి బదులుగా కొంతమేర వేతనాలను పెంచింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 108 సిబ్బంది సేవలను గుర్తించింది. జిల్లాలో 108 వాహనాలు 17 వరకూ ఉన్నాయి. వీటిలో 86 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో పైలెట్లు, ఈఎంటీలు ఉన్నారు. సీనియర్ టెక్నీషియన్లకు రూ.30 వేలు, పైలెట్లకు రూ.28 వేలు, జూనియర్ టెక్నీషియన్లకు రూ.20 వేలు, పైలెట్లకు రూ.18 వేలు అందిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయంతో వారికి అదనంగా రూ.4వేల వంతున అందనుంది.


మెయిన్ రోడ్డుపై ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

ఇరుకు రోడ్డు.. ఇరువైపులా పార్కింగ్

● నిత్యం ట్రాఫిక్‌తో బేజారు.. నిలిచిపోతున్న వాహనాలు

● ఇదీ భోగాపురం పెద్దవీధిలోని మెయిన్‌రోడ్డు వద్ద పరిస్థితి

భోగాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):భోగాపురంలోని పెద్దవీధి మెయిన్ రోడ్డులో నిత్యం వాహనచోదకులు, ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. సెలవు రోజు తప్ప మిగతా రోజుల్లో ఈ మార్గంలో ప్రైమ్ టైమ్‌లో రాకపోకలకు ప్రద్మవ్యూహం చేధించాల్సివస్తోంది. ప్రధానంగా ఇరుగ్గా ఉండే ఈ రోడ్డు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ రహదారిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ఓ ప్రైవేటుఆసుపత్రి ప్రధానంగా ఉన్నాయి. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వందలాది మంది భూములు, స్థిరాస్థుల క్రయ విక్రయాలకు కార్లు, ద్విచక్రవాహనాల్లో వస్తుంటారు. వారంతా రహదారికి ఇరువైపుల కార్లను పార్కింగ్‌చేస్తుండడంతో నడిచివెళ్లే వారు సైతం ఇక్కడ ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఈ రహదారిలో వాహనాల రద్దీ ఉంటోంది. భోగాపురానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో స్కూల్ బస్సులు రాకపోకల సమయంలో రహదారిపై గంటలకొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ ఆసుపత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది వస్తుంటారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చేవారు మెయిన్‌రోడ్డుపై కాకుండా దూరంగా, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలు నిలుపుదలచేసుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా పంచాయతీ అధికారులతో మాట్లాడి మెయిన్ రోడ్డుపై నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయిస్తామని సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడి కార్యాలయానికి వచ్చేవారు వాహనాలను రహదారిపైన కాకుండా దూరంగా నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతామని చెప్పారు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధర్మపురిలో యువకుడి ఆత్మహత్య

విజయనగరం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మపురి కెల్లవీధిలో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు విజయనగరం రూరల్ రూరల్ ఏఎస్‌ఐ పి.రామారావు తెలిపారు. ఏఎస్‌ఐ కథనం మేరకు.. ధర్మపురికి చెందిన చెల్లూరి అప్పలనాయుడు (41) పీడబ్ల్యూ మార్కెట్‌లో కళాసీగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న అప్పలనాయుడు తరచూ భార్య పిల్లలతో వివాదానికి దిగేవాడు. ఈనేపథ్యంలో భార్య పిల్లలను తీసుకుని అయ్యన్నపేట పుట్టింటికి వెళ్లిపోయేది. దీంతో పెద్ద మనుషులు కలుగజేసుకుని ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చేవారు. ఎప్పటిలాగే ఈనెల 25న మద్యం సేవించిన అప్పలనాయుడు భార్యతో గొడవపడ్డారు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం తెల్లవారుజామున సోదరుడు నారాయణరావు అప్పలనాయుడు ఇంట్లో చూడగా, ఫ్యాన్‌కి ఉరివేసుకుని విగతజీవిగా కన్పించాడు. దీంతో సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

రాజాంలో యువకుడిపై దాడి

రాజాం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తనపై ఎనిమిది మంది చేతులు, రాళ్లతో కొట్టి దాడిచేశారని మునిసిపాలిటీ పరిధిలోని సారధికి చెందిన శ్యాంసుందరరావు శనివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజాం మండలంలోని గురవాం గ్రామానికి చెందిన నవీన్, తేజు, మురళి, పెనుబాక గ్రామానికి చెందిన ఫణీంద్ర, పట్టణానికి చెందిన రాజు మరో ఇద్దరితో కలిసి పట్టణంలోని సారధిరోడ్‌లోని వైఎస్సార్ పార్క్ వద్ద దాడి చేశారని పేర్కొన్నారనిసీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. గాయపడిన శ్యాంసుందరరావు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. శ్యాంసుందరరావు ఫిర్యాదు మేరకు దాడిచేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

విజయనగరం క్రైం,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలంలోని రామలింగాపురం శివార్లలో సారా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. అసిస్టెంట్ కమిసనర్ రామచంద్రరావు ఆదేశాల మేరకు సారా రవాణా చేస్తున్న సిమ్మా అచ్చెన్నను అదుపులోకి తీసుకుని, తదుపరి చర్యలు నిమిత్తం కొత్తవలస ఎక్సైజ్‌స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, రాంబాబు, ఈసీలు నాయుడు, మనోజ్ పాల్గొన్నారు. సాలూరు మండలంలోని పురోహితునివలస శివార్లలో సారావిక్రయిస్తున్న దివ్వెల రామారావును అదుపులోకి తీసుకుని వంద సారాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఎస్‌వీ రామారావు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ సుదర్శనకుమార్, కానిస్టేబుళ్లు రాము, జనార్దనరావు పాల్గొన్నారు.

సారాతో పట్టుబడితే భవిష్యత్ అంధకారం

సారా అక్రమంగా రవాణా, విక్రయాలు ప్రమాదకరమని పట్టుబడితే, జైలు శిక్ష తప్పదని ఎన్‌ఫోర్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు.శనివారం కొత్తవలస మండలంలోని రామలింగాపురంలో సారా వల్ల కలిగే అనర్థాలపై ఫ్లెక్సీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అక్రమంగా సారాతో పట్టుబడితే, కేసులు నమోదవుతాయని యువత భవిష్యత్ అంధకారం అవుతుందని తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

గజపతినగరం, డిసెంబరు 28:(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదుపాడలో తాళం వేసిఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీఏవీ రమణ తెలిపారు.శనివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ గజపతినగరం గ్రామానికి చెందిన తెన్నేటి నరసింహమూర్తి ఈనెల రెండో తేదీన కుటుంబసభ్యులతో బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లారని చెప్పారు. ఇంటికి తాళంవేసి ఉండడంతో అదే గ్రామానికి చెందిన తూముల దాలయ్య తాళం పగలగొట్టినట్లు తెలిపారు.ఈమేరకు మూడు కిలోల వెండి, రెండుకిలోల ఇత్తడి, టీవీ, నగదును అపహరించుకుపోయాడని నరసింహమూర్తి చేసిన ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో దాలయ్య నిందితుడిగా గుర్తించినట్లు చెప్పారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బేకరీలో అధికారుల తనిఖీలు

● ఏడు గ్యాస్ సిలిండర్లు, తూనిక యంత్రాలు సీజ్

● శ్యాంపిళ్ల సేకరణ ● నిల్వ ఉన్న పదార్థాల గుర్తింపు


బేకరీలో తినుబండారాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజాం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పాలకొండ రోడ్డులో గల రవి బేకరీపై శనివారం సాయంత్రం విజిలెన్స్ ఫుడ్ అండ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, కార్మికశాఖల అధికారులు దాడులు నిర్వహించారు. బేకరీలో స్వీట్లు, బేకరీ ఆహార వస్తువులతోపాటు ఇతర తినుబండారాలను తనిఖీచేశారు. ఆహార పదార్థాల రుచి, వాసన పరిశీలిం పదార్థాలు నిల్వ ఉంచడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పలువురు వినియోగదారులు ఆహార పదార్థాల నాణ్యతపై బేకరీ యజమాని రవితో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ఏడు వంట గ్యాస్ సిలిండర్లు, పలు తూనిక యంత్రాలను ఆయాశాఖల అధికారులు సీజ్ చేశారు. పలురకాల తినుబండారాల శ్యాంపిళ్లను తదుపరి పరీక్షల కోసం అధికారులు తీసుకువెళ్లారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐ బి.రామారావు, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ, తూనికలు కొలతలు శాఖ అధికారి ఎ.బలరామకృష్ణ, కార్మికశాఖ అధికారి కొండలరావు, ఆర్‌ఐ విద్యాసాగర్ తదితరులు తనిఖీలు చేశారు.

ఉంగరాడలో గొర్రెల మృతి

రేగిడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడలో నాలుగు రోజుల వ్యవధిలో ఇప్పిలి వీరబాబుకు చెందిన 30 వరకు గొర్రెలు మృతి చెందాయి. శనివారం ఒక్కరోజే ఆరు గొర్రెలు మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులతోపాటు గొర్రెల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు గొర్రెలను మోపడానికి తీసుకువెళ్లిన సమయంలో చలి బారినపడ్డాయి. దీంతో దీంతో వణుకుతో మృతిచెందుతున్నాయని బాధిత కుటుంబ సభ్యులతోపాటు సర్పంచ్ భూజంగరావు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గొర్రెలు,మేకలను సంరక్షించాలని గ్రామస్థులు, తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

రాజాం, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జౌహర్‌బాబుపై జరిగిన దాడిపై రాజాం ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు శనివారం భోజనవిరామం సమయంలో నిరసన తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి దోషులను శిక్షించాలని, ఎంపీడీవోకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభల షెడ్యూల్ విడుదల చేయాలి

శృంగవరపుకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జనవరి రెండో తేదీ నుంచి జరిగే గ్రామసభల షెడ్యూల్‌ను విడుదలచేయాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు డి.సూర్యారావు కోరారు. శనివారం శృంగవరపుకోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా జరగనున్న గ్రామసభల వివరాలను ముందుగా అధికారులు తెలియపరచాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక ప్రతినిధులు సాంబమూర్తి, సీహెచ్ రామకృష్ణ, వజ్రపు ముత్యాలు పాల్గొన్నారు.

సపోర్టింగ్ స్టాఫ్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారామెడికల్ విభాగంలో 20మిగతా సపోర్టింగ్ మొత్తం కలిపి 91 ఉద్యోగాలు భర్తీచేయనున్నట్టు పేర్కొన్నారు. జనవరి ఎనిమిదో తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.వివరాలకు విజయనగరం. ఎపీ.జీఓవీ. ఇన్ లేదా విజయనగరం. ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సెట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు

పర్యాటకాభివృద్ధిపై చర్చ

శృంగవరపుకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌తో టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి చర్చించారు.ఈ మేరకు శనివారం రాజమండ్రిలో ఆయన్ను సుధారాణి కలిశారు.

బాధితులకు సాయం

భోగాపురం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రాయవలసకుచెందిన దువ్వ అప్పన్న పశువులశాల దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులకు జనసేన మండలాధ్యక్షులు, నాయకులు వందనాల రమణ, దల్లి శ్రీను, కోరాడ వెంకటరమణ శనివారం రూ.10వేలు అందజేశారు. ఆపదలో కార్యక్రమంలో జనసేన నాయకులు బొల్లిత్రినాథ్, సత్యనారాయణ, రాధా రెడ్డి, శంకర్, రామసూరి, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలి

జామి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దల ఆక్రమణలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూములను రక్షించాలని తాండ్రంగికి చెందిన మానవహక్కుల సంఘ ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు కోరారు. ఈమేరకు శనివారం జామి తహసీల్దార్‌కార్యాలయం ఆవరణలో గల గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల వందల ఎకరాలు ప్రభుత్వ భూములతోపాటు డీపట్టా భూములు చేతులు మారాయని ఆరోపించారు. జామిలో శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. అనంతరం ఆర్ఐ సుజనకు వినతిపత్రం అందజేశారు.

సమయపాలన పాటించాలి

రేగిడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించడంతోపాటు, కేంద్రాల నిర్వహణలో లోపాలు ఉండకూడదని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ కోరారు. శనివారం మండలంలోని సంకిలి, ఉణుకూరు, బూరాడ, రేగిడి సెక్టారు సమావేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల కార్యకర్తలు, సుపర్‌వైజర్లతోసమీక్షించారు. ప్రీస్కూళ్ల నిర్వహణతో పాటు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీచేయాలని ఆదేశించారు. నాలుగుసెక్టార్లలోని ప్రీస్కూళ్ల పిల్లలకు పిపి-1, పిపి-2 కిట్లు కేంద్రాలకు పంపిణీచేశారు. సమావేశంలో సుపర్‌వైజర్లు జానికి, సూజత, అమ్మన్నమ్మ, పద్మప్రసన్న పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి

విజయనగరం క్రైం, డిసెంబరు 28: (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగల్లో లిక్కర్‌తో పార్టీ జరుపుకునేవారు ముందస్తుగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నుంచి ఈవెంట్ పర్మిట్ తీసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీఎన్ బాబ్జీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిట్ కావలసిన వారు సంబంధిత ఎక్సైజ్ ఇన్ స్పెక్టరును సంప్రదించాలని పేర్కొన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు, వ్యాపారులు అనుమతి తీసుకోవాలని, నిబంధనల ప్రకారం ఈవెంట్ పర్మిట్‌ను పొందాలని తెలిపారు. పర్మిట్ లేకుండా లిక్కర్ సరఫరా చేసినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అటువంటి ఈవెంట్ నిర్వహించే యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్మిషన్ కోసం జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి 86396 76401, పార్వతీపురం మన్యం జిల్లా 94906 42242 నెంబరును సంప్రదించాలని కోరారు.

సిరిపురంలో 11 ఇళ్లు దగ్ధం

సంతకవిటి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 11 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ మేరకు పొందరవీధి కాలనీలో అరికాళ్ల అప్పారావు, మంచిరెడ్డి చిన్నరసింహులు, ముత్తమ్మ, గౌరమ్మ, కన్నడు, చిన్నారావు, రామదాసు పార్వతీ, లంక అచ్చయ్యమ్మ, లక్ష్మీదేవి ఇళ్లలో వంట సామగ్రి, దుస్తులు, విద్యుత్ మీటర్లు, రూ.ఎనిమిది లక్షలు, 11 తూలాల బంగారం కాలిబూడిదయ్యిందని పొందూరు అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. మంటల వల్ల నాలుగు గ్యాస్ సిలిండర్ల పేలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. కాగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని తహసీల్దార్ బి.సత్యం తెలిపారు.


రోడ్డు మధ్యలో చెత్త విడిచిపెట్టిన దృశ్యం

రోడ్డుపై చెత్త.. రాకపోకలకు ఇక్కట్లు

● ఇదీ జామి పంచాయతీలో దుస్థితి

జామి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జామి పంచాయతీలో రోడ్డుపైనే చెత్తను సిబ్బంది విడిచిపెట్టడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. శనివారం ఉదయం గ్రామంలోని కాలువల్లో సేకరించిన చెత్త బయటకుతీశారు. అయితే సిబ్బంది చెత్తను రోడ్డు మధ్యలో విడిచిపెట్టేశారు. దీంతో దుర్వాసన వెలువడుతుండడంతోపాటు, దోమలు స్వైరవిహారం చేస్తుండడం వల్ల స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ 11 మంది గ్రీన్‌అంబాసిడర్లు, నలుగురు ఎస్ఎమ్ఆర్‌లు ఉన్నా చెత్త సక్రమంగా సేకరించి, తరలించడం లేదని లేదని పలువురు వాపోతున్నారు. కాగా కాలువలో చెత్తను రెండురోజుల కిందట బయటకు తీశామని, తడిగా ఉండడంతో ఆరాలని అక్కడే విడిచిపెట్టినట్లు ఇన్‌చార్జి ఈవో రమణారావు తెలిపారు.

వైసీపీ నాయకుల ధర్నా హాస్యాస్పదం

● విద్యుత్‌చార్జీలపై నిరసన తెలపడంపై టీడీపీ నాయకుల ధ్వజం

విద్యుత్ చార్జీలపై వైసీపీ నాయకులు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.ఈ మేరకు జిల్లాలోని వేర్వేరు చోట్ల టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌చార్జీలపై వైసీపీ నాయకులు నిరసన తెలియజేయడంపై టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు.

వచ్చే ఏడాది కూడా చార్జీలు పెంచం: కోళ్ల

లక్కవరపుకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చార్జీలు పెంచబోమని, వచ్చే ఏడాది కూడా చార్జీలు పెరగవని లలితకుమారి తెలిపారు. శనివారం లక్కవరపుకోటలో విలేకరులతో మాట్లాడుతూ 2019లో చంద్రబాబు మిగులు విద్యుత్‌తో జగన్‌కు అప్పగించారని తెలిపారు. జగన్ హయాంలో ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నెత్తిన బిల్లులు వేశారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు పాల్గొన్నారు.

వైసీపీది అసత్య ప్రచారం: కిమిడి

చీపురుపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు, మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి అసత్యాలు ప్రచారం చేసున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విమర్శించారు. శనివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాస్తవానికి 2022 నుంచి 2024 వరకూ రెండేళ్ల కాలానికి 17 వేల కోట్లు ట్రూఅప్ చార్జీల కింద వసూలు చేయాలని ఆనాడే జగన్ సర్కారు నిర్ణయించిందని తెలిపారు. అప్పుడుచేసిన నిర్ణయాన్ని డిసెంబరు నుంచి అమలు చేయాల్సిందిగా ఈఆర్‌సీ ఉత్తర్వులిచ్చిందని నాగార్జున చెప్పారు. ప్రజలను మభ్యపెట్టడానికే వైసీపీ నాయకులు ర్యాలీ చేస్తూ, కొత్త డ్రామాలాడుతున్నారని ఎద్దేవా చేశారు.


చీపురుపల్లి: మాట్లాడుతున్న నాగార్జున


భోగాపురం: కర్రోతు బంగార్రాజు

చార్జీల పెంపు పాపం జగన్‌దే: బంగార్రాజు

భోగాపురం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు పాపం జగన్‌మోహన్‌రెడ్డిదేనని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు ఆరోపించారు. భోగాపురంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డే విద్యుత్ చార్జీలు పెంచి మళ్లీ ధర్నాలు చేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి, దాసరి అప్పలస్వామి, ముకుంద, రమణబాబు పాల్గొన్నారు.

ధర్నాలు చేయడం సిగ్గుచేటు

రాజాం, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): వైస్ జగన్‌రెడ్డి హయంలో విద్యుత్ చార్జీలు అడ్డుగోలుగా పెంచి ఇప్పుడు టీడీపీపాలనలో చార్జీలు పెరిగాయని వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటు అని రాజాం మండల టీడీపీ నేతలు ఎద్దేవాచేశారు. రాజాంలో తూర్పుకాపుకార్పొరేషన్ డైరెక్టర్ గురువాన నారాయణరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వల్లూరి గణేష్, కొంపల్లి రవీంద్ర, గేదల బాలమూరళి, సూరిబాబు, ఆటోకోటి, రాజేష్ అప్పలనాయుడు విలేకరులతో మాట్లాడారు.

వైద్యాధికారులు బాధ్యతగా పని చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు గ్రామాల్లో బాధ్యతగా పని చేయాలని కలెక్టరు అంబేద్కర్ కోరారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్యాధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలుగా పీడిస్తున్న డయేరియాపై ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, క్లోరినేషన్, ఆరోగ్యపరిస్థితులపై దృష్టి పెట్టాలని తెలిపారు. గుర్లలో డయేరియా అనంతరం జిల్లాలో డ్రైనేజీల్లో గల పైపు లైన్లు బయిటకు తీసినట్లు చెప్పారు. ప్రసుత్తం నీటి కాలుష్యం లేదని, ఇంకోసారి డయేరియాకు నీటి కాలుష్యం కారణమని వినపకూడదన్నారు. ప్రజలు వ్యాధులు బారిన పడకుండా చూసే బాధ్యత వైద్యాధికారులదేనని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాణి, డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

3న గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

జిల్లాలో జనవరి మూడో తేదీన 3,857 గృహ ప్రవేశాలను నిర్వహించనున్నట్లు కలెక్ట రు అంబేద్కర్ వెల్లడించారు. ఈమేరకు శనివారం గృహ నిర్మాణ శాఖ అధికారులుతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.గృహ ప్రవేశాలకు పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చిన్న చిన్న పనులు ఏవైనా మిగిలిఉంటే వెంటనే వాటిని పూర్తిచేసి వసతులతో ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు.

పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● జిల్లా వనరుల కేంద్ర అధికారి గోవిందమ్మ

గజపతినగరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):వర్షాలకు నీట మునిగిన పంటలను రక్షించుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్ర అధికారి గోవిందమ్మ తెలిపారు. శనివారం మండలంలోని పాతబగ్గాం, కొత్తబగ్గాంలో మొక్కజొన్న, అపరాలపంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ముంపు నీటిని బయటకు తీసి అపరాల పంటలకు సంబంధించి ఎకరాకు 15 కేజీల యూరియా చల్లు కోవాలని సూచించారు. తెగులు, పురుగుల ఉధృతి తగ్గించడానికి అధికారుల సూచనలు పాటించాలని కోరారు. మొక్కజొన్న పంటకు యూరియా, పొటాష్ చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవోధనలక్ష్మి, వీఏఏలు సౌజన్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్రజలకు మేలు

● విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య


ఎల్‌ఆర్‌ఎస్ పత్రాన్ని అందజేస్తున్న నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) మేళాతో ప్రజలకు మేలు జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ మేళాతోపాటు ఓపెన్ ఫోరం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కమిషనర్ నల్లనయ్య ఎల్‌ఆర్‌ఎస్ ప త్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణాళికాధికారులు, సిబ్బంది, లైసెన్స్‌డ్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఒకే చోట ఏర్పాటై మేళాగా రూపొందించి అక్కడిక్కడే దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సీఎంఆర్‌ఎఫ్ సాయం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న లలితకుమారి, శ్రీభరత్

లక్కవరపుకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందజేశారు. ఈమేరకు విశాఖ ఎంపీ శ్రీభరత్ చేతుల మీదుగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందుకున్నారు.శనివారం విశాఖలోని భరత్ నివాసం వద్ద ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ నాయకులు రాం ప్రసాద్, కొరెడ్ల ఈశ్వరరావు, పెద బాబు సమక్షంలో భరత్ రూ.లక్షా 20,283 చెక్కును అందజేశారు. మల్లునాయుడు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశార కార్యక్రమంలో నాయకులుకొట్యాడ రమణమూర్తి, ఎల్.శ్రీను పాల్గొన్నారు.

కోళ్ల పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు విఫలం

● కర్లాంలో ప్రధాన గేటు వద్ద కార్మికుల 'వంటా-వార్పు'


గేటు వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తున్న కార్మికులు

చీపురుపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్లాంలోని కోళ్ల పరిశ్రమలో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య శనివారం జరిగిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. శుక్రవారం నుంచి కార్మికులు నిరవధిక దీక్షలు ప్రారంభించిన నేపథ్యంలో యాజమాన్యం శనివారం కార్మికులతో చర్చలు జరిపింది.యాజమాన్యం తరఫునజీఎం హరికృష్ణ, డీజీఎం గౌరి, కార్మికుల తరపున సీఐటీయూ జిల్లా నాయకులు టీవీ రమణ, అంబల్ల గౌరినాయుడు, గురునాయుడు, ఈశ్వరరావు చర్చలు జరిపారు. యాజమాన్యం మొండి వైఖరికి విడనాడి తమ డిమాండ్‌కు అంగీకరించాలని కార్మికులు కోరారు. అయితే తమ పరిధి మేరకు మూడు వందలు పెంచగలమని, మరింత సమయమిస్తే, యాజమాన్యంతో మాట్లాడతామని చర్చల్లో పాల్గొన్నవారు తెలిపారు. చర్చల్లో పురోగతి కనిపించకపోవడంతో కార్మికులు యథావిధిగా నిరవధిక దీక్షలు కొనసాగించారు. దీక్షల్లో భాగంగా పరిశ్రమ ప్రధాన గేటు వద్ద కార్మికులు శనివారం వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. కాగా కర్లాం కోళ్ల పరిశ్రమ వద్ద జరుగుతున్న కార్మికుల దీక్ష శిబిరాన్ని ఆర్డీవో సత్యవాణి, డీఎస్పీ ఎస్. రాఘవులు శనివారం సందర్శించారు. ఇప్పటివరకూ అన్నిస్థాయిల్లో చర్చలు జరిగాయని, జనవరి 2న తమ ఆధ్వర్యంలో చర్చలు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు. చీపురుపల్లిలోని తమ కార్యాలయంలో జరగనున్న చర్చలకు ఇరువర్గాలు రావాలని కోరారు.

బాధ్యతగా పనిచేయాలి

రాజాం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివా సరావు కోరారు.మండలంలో సోపేరు, బొద్దాం సచివాలయాలను శనివారం ఎంపీడీవో తని ఖీచేశారు. అనంతరం పల్లెపండగ అభివృద్ధిప నుల ప్రగతిని పరిశీలించారు.

సామాజిక ఆడిట్ కచ్చితంగా ఉండాలి

రేగిడి, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఇతర విభాగాలపై నిర్వహించే సోషల్ ఆడిట్ కచ్చితంగా ఉండాలని వైస్ఎంపీపీలు టెంకాల అచ్చెంనాయుడు, వి.జగన్మోహణరావు పేర్కొన్నారు. శనివారం రేగిడి ఉపాధిహామీ పథకం కార్యాలయంలో 17వ విడిత సోషల్ ఆడిట్‌పై సమావేశం నిర్వహించారు. నిర్వహించిన పనులపై కచ్చితమైన ఆడిట్‌చేయాలని, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి వాస్తవాలు ఆడిట్‌లో పొందుపర చాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏపీవో హరినాథ్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):రైతులకు అండగా ఉంటామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. శనివారం మండలంలోని గుణుపూరుపేటలో పొలాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎనిమిది రోజులుగా కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలను నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. తడిచి రంగుమారిన ధాన్యం ప్రభుత్వం కొనే విధంగా ప్రణాళిక చేపడతామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అప్రమత్తంగాఉండాలని, రైతు సేవా కేంద్రాల్లో అధికారులు నిర్ధారించిన ధాన్యం తేమ శాతాన్ని మిల్లర్లు పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. మిల్లర్లు రైతుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నా, అలసత్వం వహించినా చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపా రు. కార్యక్రమంలో ఎంపీపీ బి.వాసుదేవరావు,మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, ఏవో నిర్మల, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షులు పల్లె భాస్కరరావు, పాణిరాజు, జనసేన నాయకులు కంది సూర్యనారాయణ, పైల శంకర్ పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న లోకం నాగమాధవి

ఆ భూమి కోసం నకిలీ ఐపీఎస్‌గా..

(ఐదో పేజీ తరువాయి)

బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లాడు. ఈ నెల 20న సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోల లో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యక్రమం ఉందని తెలుసుకున్నాడు. అక్కడికి వచ్చే వీఐపీలతో ఫొటోలు తీసుకొని వాటిని చూపించి భూమిని పొందాలనుకున్నాడు. వీఐపీలంతా వ్యూపాయింట్ వద్దకు వెళ్లిన తర్వాత కారు పార్కింగ్ వద్ద కారు ఆపి ద్విచక్రవాహనంపై ఆ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ కొంత మందితో ఫొటోలు దిగి కాలి నడకన కొండపై నుంచి కిందకు చేరుకొని తన వాహనంలో సాలూరు చేరుకున్నాడు. ఇది జరిగిన తర్వాత ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. సూర్యప్రకాష్ గురించి బాగా తెలిసిన వ్యక్తులు కొందరు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు సూర్యప్రకాష్ ప్రతి అడుగును పరిశీలించి శనివారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు నకిలీ ఐడీ కార్డులు, రెండు జతల యూనిఫారంలు, ఒక జంగిల్ ప్యాచ్ యూనిఫారం, నేమ్‌ప్లేట్స్, విజిల్ కార్డులు, పాత కారు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 165/24 కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ సమావేశంలో సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు నిరాకరించిన రైతులు



ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న రైతులు

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకాం పంచాయతీ దత్తివలసకు చెందిన పలువురు రైతులు పీఏసీఎస్ సర్వేకు నిరాకరించారు. ఎంపీడీవో జి.పైడితల్లితో పాటు సచివాలయ సిబ్బంది శనివారం పీఏసీఎస్ సర్వేకు దత్తివలస వెళ్లారు. అయితే ఆ గ్రామ రైతులు ఈకేవైసీ చేసుకునేందుకు నిరాకరించారు. రావివలస పీఏసీఎస్ సీఈవో తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రుణాలు చెల్లించినా తగిన రశీదులు అందించడం లేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండానే సంఘంలో వేరే పేరున రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. రుణాలు రెన్యువల్ చేసిన తర్వాత ఎలాంటి సమాచారం అందించడం లేదని ఎంపీడీవోకు తెలిపారు. సీఈవో తీరుపై కలెక్టర్‌తో పాటు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బినామీ రుణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని వారు కోరారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. సర్వేకు సహకరిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీంతో రైతులు సర్వేకు సమ్మతించారు.

ఆసుపత్రిలో ప్రసవం జరగాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

పాచిపెంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గర కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రసవం జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీఎస్ పద్మావతి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని ఆమె శనివారం సందర్శించారు. మందుల నిల్వల గదిని, ల్యాబ్‌ని పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. రోజుకు ఎంత ఓపీ వస్తుందనేది గమనించారు. గత నెల కంటే మలేరియా, డెంగ్యూ వ్యాధులు తగ్గాయన్నారు. కుక్క కాటు, పాము కాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నలుగురు సూపర్ వైజర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారని, ఈ విషయమై ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. రక్తహీనతకు సంబంధించి గ్రామ సచివాలయాల పరిధిలో కమిటీల నియామకం చేపట్టామన్నారు. రక్తహీనత కలిగిన గర్భిణుల పట్ల ముందు జాగ్రత్త చర్యలు చేపడతామని తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారి నాయుడు సూచించారు. తోటపల్లి అన్నపూర్ణేశ్వరి గిరిశక్తి సమావేశ మందిరంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన 60 మంది సంక్షేమ నేస్తాలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీడీఏ ఉపాధి హామీ పథకం ఏపీడీ రెడ్డి సురేష్‌నాయుడు మాట్లాడుతూ ఉపాధి పథకంలో 96 రకాల పనులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ ఏపీఐవో కల్యాణ్ రామ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కురుపాం వెలుగు ఏపీఎం వెంకటరమణ, కృష్ణప్రసాద్, లోకేష్, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, జట్టు సిబ్బంది ఎం.నూకంనాయుడు, జి.మురళీ మోహన్, ఆరు పంచాయతీలకు చెందిన సంక్షేమ నేస్తాలు పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశానికి సభ్యుల గైర్హాజరు

శృంగవరపుకోట డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాధారణ సమావేశానికి 14 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. 20 మంది సభ్యులకు కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఇందులో 12 వార్డు సభ్యుడు అనకాపల్లి చెల్లియ్య రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయారు. ఐదుగురు సభ్యులు మాత్రమే సాధారణ సమావేశంలో ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలో పొందు పరిచిన అంశాలను చర్చించేందుకు కార్యనిర్వాహక అధికారి వీవీ అనురాధ అవకాశం కల్పించారు. కాగా సమాచారం ఇవ్వకుండా అజెండాను తయారు చేయడంతో పాటు సభ్యులకు గౌరవం ఇవ్వకపోవడంతో సాధారణ సమావేశానికి తనతో పాటు పది మంది వైసీపీ సభ్యులు హాజరు కాలేదని ఉప సర్పంచ్ మోపాడ కుమార్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో టీడీపీకి చెందిన నలుగురు సభ్యులు సమావేశానికి ముఖం చాటేసినట్లు తెలిసింది. తక్కువ మంది సభ్యులతో ప్రాధాన్యత అంశాలను చర్చించేందుకు అవకాశం కల్పించిన ఈవో వ్యవహార శైలిని పలువురు గైర్హాజరు సభ్యులు తప్పుపట్టారు.

మజ్జి గౌరమ్మను దర్శించుకున్న బేబీనాయన

ఒడిశా

రాయగడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయగడ మజ్జిగౌరమ్మ తల్లిని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన శనివారం దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు ఆయనకు ఆహ్వానం పలికి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆంధ్రా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, త్వరలో తల్లి దీవెన, ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తామని తెలిపారు. ఏపీని అగ్ర స్థానంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సర్వ శక్తులు ప్రసాదించా లని అమ్మవారిని వేడుకున్నట్టు ఆయన చెప్పారు.



ఎమ్మెల్యేకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అలంకారప్రాయంగా..

● నిరుపయోగంగా ఇంటింటి కొళాయిలు
● నెరవేరని 'జలజీవన్ మిషన్' లక్ష్యం
● వృథాగా ప్రభుత్వ నిధులు
● ఇబ్బందులు పడుతున్న పెంట గ్రామస్థులు





పని చేయని కొళాయిలపై వివరిస్తున్న మహిళలు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశాయి. పనుల్లో నాణ్యతా లోపమో.. ప్రజల బాధ్యతా రాహిత్యమో తెలియదు కానీ ఈ కొళాయిలు ఇప్పుడు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలి మండలంలోని పెంట గ్రామమే దీనికి నిదర్శనం. పెంట గ్రామంలో గత ఏడాది జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.15లక్షల వ్యయంతో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే ఈ కొళాయిల నుంచి పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాలకు పూర్తిగా నీరు అందడం లేదు. దీంతో మహిళలు వీధి కొళాయిలు, చేతి పంపుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వ ధనం ఖర్చయ్యిందే తప్పా ప్రజలకు ఎలాంటి ఫలితం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. అలాగే మండలంలోని కుమందన్‌పేట, కారాడ గ్రామల్లో కూడా ఇదే పరిస్థితి. నీటి లభ్యతతో పనిలేకుండా ఎడాపెడా కనెక్షన్లు ఇచ్చేశారు. దీంతో ఈ కొళాయిలన్నీ అలంకారప్రాయంగా మిగిలాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తాగునీరు అందించాలని స్థానిక మహిళలు కిలారి రాములమ్మ, గర్భాపు విజయలక్ష్మి, విశాలాక్షి తదితరులు కోరారు.

కొళాయిలను సరిచేస్తాం

ఈ విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రవణ్‌కుమార్‌ని వివరణ కోరగా, గ్రామస్థులు కొళాయిలు విరిచేస్తున్నారని, నీరు ప్రెజర్ లేకపోవడంతో అన్ని కొళాయిలకు నీరందడం లేదని చెప్పారు. తదుపరి బడ్జెట్‌లో వీటిని సరిచేసే బాధ్యత తీసుకుంటామన్నారు.

మూడు నెలల్లో పూర్తి చేస్తాం

● మంత్రి సంధ్యారాణి
● వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పరిశీలన



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని మరో మూడు నెలల్లో పూర్తి చేయించి, ప్రారంభోత్సవం చేసి సాలూరు నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయబోతున్నామని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. బిల్లుల విషయంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.10లక్షలతో నిర్మిస్తున్న బర్త్ వెయిటింగ్ హాల్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో 2025 మార్చి నాటికి నిర్మాణం పనులు పూర్తి జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ హోదాలో తాను ఉంటానని తెలిపారు. కౌన్సిల్ సభ్యుల నుంచి సభ్యుడిగా వైకుంఠపు హర్షవర్ధన్‌ను, అలాగే సభ్యులుగా కారేపు చంద్రరావు, కాళ్ళ శ్రీనులు నియమిస్తామని చెప్పారు. వైద్యుల వివరాలు బోర్డుల్లో ప్రదర్శించాలని, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిసప్షనిస్టును ఏర్పాటు చేయాలని సూచించా రు. ఆర్వో ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఏకే రత్నకుమారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పరమేష్, కూనిశెట్టి భీమారావు, పప్పల మోహన్, జనసేన నాయకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్వాకంతోనే విద్యుత్ చార్జీల పెంపు

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లనే విద్యుత్ చార్జీలు పెరిగాయని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆరోపించారు. ఆమె శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై గోల చేస్తున్నారన్నారు. పోలవరం హైడ్రో విద్యుత్, కృష్ణపట్నం థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్‌పై దృష్టి పెట్టకుండా కమిషన్ పడే అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేశారని ఆమె వైసీపీ ప్రభుత్వంపై ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ పాడి సుధ, గరుగుబిల్లి నాయకులు పురుషోత్తంనాయుడు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అవినీతితో ప్రజలపై భారం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతి వల్లనే వినియోగదారులపై విద్యుత్ భారం పడుతోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ అవినీతితో జరిగిన నష్టం రూ.1,29,503 కోట్లు అన్నారు. జగన్ అవినీతి వల్లే విద్యుత్ చార్జీల భారం పడుతుంటే తిరిగి వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన దారుణ తప్పిదాల వల్ల విద్యుత్ వినియోగదారులపై చార్జీల రూపంలో రూ.32,166 కోట్లు పడిందని, విద్యుత్ సంస్థలపై రూ.49,596 అప్పులు పెరిగాయన్నారు. వీటీపీఎస్ కృష్ణపట్నం థర్మ ప్లాంట్ ఏర్పాటులో జాప్యం వల్ల రూ.12,818 కోట్లు నష్టం వచ్చిందన్నారు. పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు జాబ్ ఇవ్వడం వల్ల రూ.4,737 కోట్లు నష్టం ఏర్పడిందని, స్వల్ప కాలిక విద్యుత్ కొనుగోలుతో వల్ల రూ.2,691 కోట్లు నష్టం ఏర్పడిందని, ఏడాదికి 7వేల మెగావాట్ల సోలార్ పవర్ వల్ల రూ.3,850 కోట్లు నష్టం ఏర్పడిదని వివరించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం మిగులు విద్యుత్‌ను జగన్‌రెడ్డి చేతిలో పెట్టిందన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై పర్యవేక్షించాలి



విద్యార్థుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న జగన్మోహన్‌రావు

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పర్యవేక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి తెర్లి జగన్మోహన్‌రావు సూచించారు. మండలంలోని తోటపల్లి, సంతోషపురం గ్రామాలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లోపంతో పాటు హైరిస్క్ ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక సేవలందించాలన్నారు. ఎనీమియా యాక్షన్ కమిటీలు రక్తహీనత నివారణకు కార్యాచరణ చేపట్టాలన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐరన్ మాత్రలను అందించాలన్నారు. ఆరోగ్య సమస్యలపై సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పరిశీలనలో స్టాటిస్టికల్ అధికారి శంకరరావు, వైద్య సిబ్బంది యశోద, కలావతి, కాత్యాయిని, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

సీతంపేట రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో అవగాహన లోపం వల్ల జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో కె.గీతాంజలి అన్నారు. శనివారం స్థానిక సామాజిక భవనంలో సీతంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సౌజన్యంతో కిశోర వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలోని అంశాలపై అధికారులు అవగాహన కల్పించుకుని గ్రామస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏజెన్సీలో ఐసీడీఎస్ ద్వారా బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రంగలక్ష్మి, లీగల్ రీసోర్స్ పర్సన్ పి.శ్రీధర్, ఎంఈవో ఆనందరావు, జిల్లా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్‌లు ఎస్.విస్సమ్మ, జి.గౌరీ, లావణ్య, మునిసాభేగం, ఏపీఎం కమలకుమారి, ఏఎస్ఐ సంజీవరావు, సచివాలయ సిబ్బంది, ఎంఎస్‌కెలు, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లిలో విష్ణు సహస్ర నామ స్తోత్రాలు

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం వీరఘట్టానికి చెందిన శ్రీలలితా కోటి పారాయణం బృంద సభ్యులు విష్ణు సహస్ర నామ స్తోత్రాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు.



విష్ణు సహస్ర నామాలు పఠిస్తున్న బృంద సభ్యులు

ఒప్పంద హామీలను అమలు చేయాలి

కొమరాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఒప్పంద హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వాకాడ ఇందిరా, జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కొమరాడ మండల కేంద్రంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి సీహెచ్ అనురాధ, కోటిపాం కాలనీలో మంగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు, హెల్పర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీలను మెయిన్‌గా మార్చాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, మట్టి ఖర్చులు కింద ప్రకటించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని, టీఏ, డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకర్ హెచ్చరించారు. గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలనతో పాటు మెరుగైన సేవలందించాలన్నారు. కేంద్రం పరిధిలో అత్యవసర మందులతో పాటు పాము, కుక్కకాటు ఇంజక్షన్ల నిల్వలపై వివరాలు సేకరించారు. పూర్తి స్థాయిలో మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. రోజువారీ వైద్య తనిఖీలకు ఎంతమంది వస్తున్నారన్న సమాచారాన్ని సేకరించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, డాక్టర్ సంతోష్‌కుమార్, సిబ్బంది డి.మృత్యుంజయరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

సాలూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలకు అవగాహన తప్పకుండా ఉండాలని సాలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రమేష్ పిలుపునిచ్చారు. శనివారం సాలూరు వెలుగు కార్యాలయంలో ఆయన విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన్ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలపై వేధింపులుంటే 15100 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. వేధింపులు, ఇతర సమస్యలపై మహిళలు పోలీస్‌స్టేషన్ వరకు రాకుండానే 100, 112 తదితర నెంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం మహిళలకు 15100 టోల్‌ఫ్రీ నెంబరు ఉన్న జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు, ఎంపీడీవో రమాదేవి, సాలూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తాడి తిరుపతిరావు, న్యాయవాదులు శర్మ, కోట లక్ష్మణరావు, సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి, వెలుగు ఏపీఎం జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రక్తహీనత నివారణకు కమిటీలు

వీరఘట్టం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కె.రవి, ఏపీవో జి.సత్యంనాయుడు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు, విద్యా శాఖాధికారులు, శిశు సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడిని ఖండిస్తున్నాం

వీరఘట్టం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపీడీవోపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని స్థానిక ఎంపీడీవో సిబ్బంది అన్నారు. రాష్ట్ర మండల అభివృద్ధి అధికారాల సంఘం పిలుపు మేరకు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

వీరఘట్టం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుబ్రహ్మ పాఠశాలలో డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి శనివారం విచారణ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్ సింహాచలంపై శుక్రవారం పోక్సో కేసు నమోదు అయింది. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో డిప్యూటీ ఈవో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు నుంచి వివరాలు సేకరించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం 15 గ్రామాల్లో నిర్వహించిన పీసా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తంగా 14 గ్రామాల్లో ఈ పీసా ఎన్నికలు ఏకగ్రీవం కాగా దానుపురం గ్రామంలో ఉపాధ్యక్ష, కార్యదర్శి నియామకానికి ఎన్నిక జరిగినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సోమవారం 17 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు. ఈ పీసా ఎన్నికల్లో హెచ్‌డీఎస్ కమిటీ సభ్యురాలు సంజ్ఞ, జేఏసీ నాయకులు బి.ఉమామహేశ్వరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

పాలకొండ, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రి ఆవరణలో శనివారం 108 అంబులెన్స్‌లో పనిచేసే ఈఎంటీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, విజయకుమార్ పర్యవేక్షణలో జాబ్ ట్రైనర్ ఆలుబిల్లి శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో హృద్రోగులకు అందించాల్సిన చికిత్స, మాతాశిశు రక్షణ సేవలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో పాలకొండ డివిజన్‌లో పనిచేస్తున్న 15 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సీతానగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిశోర బాలికల ఆరోగ్యం, విద్య, మానసిక ఆరోగ్య పరిరక్షణకు నిర్దేశించిన అధికార సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్వీ రమణ అన్నారు. శనివారం బలిజిపేట ఐసీడీఎస్ పీవో సురేఖ ఆధ్వర్యంలో వెలుగు వీవోఏలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు. ఎంఈవోలు సూరి దేముడు, ఎం.వెంకటరమణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై చర్యలు

సీతానగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ డి.పార్వతి తెలిపారు. లఖనాపురంలో సారా, మద్యం విక్రయాల నివారణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీతానగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.